మట్టి పరీక్ష..పొలానికి రక్ష

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- నేల భౌతిక స్వభావం తెలుసుకునే అవకాశం
- ప్రత్యేకంగా దృష్టి సారించిన వ్యవసాయ అధికారులు

ఆలూరు రూరల్/హొళగుంద: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయి. అధిక దిగుబడి సాధించే లక్ష్యంతో కొంత మంది రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి సారవంతం కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడపీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. భూసార పరీక్షతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ అధికారులు చెపుతున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 83,135 రైతులు పంటలు సాగు చేసే అవకాశం ఉంది. పంటలు వేసే ముందు రైతులు ఆర్బీకే సిబ్బందితో మట్టి నమూనా సేకరించి మట్టి పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు.

చిప్పగిరి, హొళగుంద మండలాల్లో 3,019 మట్టి పరీక్షలు లక్ష్యం

అత్యంత వెనుకబడిన మండలాల్లో ఇతర రంగాలతో పాటు వ్యవసాయ రంగాల అభివృద్ధి కోసం కేంద్రం ప్రభుత్వం ఆస్పిరేషనల్ బ్లాక్స్ కింద చిప్పగిరి, హొళగుంద మండలాలను గుర్తించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఖరీఫ్ పంటలు సాగుకు ముందు చిప్పగిరి మండలంలో 1,286, హొళగుంద మండలంలో 1,733 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టింది. మట్టి నమూనా పరీక్షలు ద్వారా నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకుని రైతులు ఏ పంటలకు ఎంత మోతాదులో ఎరువులు, మందులు ఉపయోగించాలో తెలియజేయనున్నారు.


ఆలూరు సమీప పొలంలో మట్టి నమూనా సేకరిస్తున్న ఆర్బీకే సిబ్బంది

పోషకాల స్థాయిపై పక్కాగా లెక్క

వ్యవసాయ అధికారులు సేకరించిన మట్టిని ప్రయోగ శాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయనిక పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల ఆమ్ల, క్షార గుణాలు, నేలలో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, ఎరువుల మోతాదును రైతులకు సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడం తోపాటు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో ప్రయోజనాలు

➡ భూసార పరీక్షల ద్వారా భూమిలో కర్బన శాతం, పీహెచ్ విలువను తెలుసుకోవడంతో పాటు నత్రజని, భాస్వరం, పొటాష్, లోపాలను గుర్తించవచ్చు.
➡ జింక్, ఐరన్, బోరాన్, మాలిక్యూలర్, సల్ఫర్ మాంగనీష్ తదితర 16 రకాల సూక్ష్మ పోషకాంశాలను గుర్తించవచ్చు.


మట్టి నమూనా సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

➡ భూమిలో ఉండే లోపాలు తెలుసుకుని వ్యవసాయ శాఖాధికారుల ద్వారా వాటి నివారణ చర్యలు చేపట్టవచ్చు
➡ రైతులు తగిన పైర్లను ఎంచుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.
➡ రసాయన ఎరువుల అనవసర వాడకాన్ని, ఖర్చును తగ్గించవచ్చు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

➡ పంట కోత పూర్తయిన తరువాత, వేసవిలో పంటలు లేని సమయంలో మట్టి నమూనాలు సేకరించాలి. పొలాలకు సాగు నీరు వదిలినప్పుడు, ఎరువులు వేసినప్పుడు మట్టి నమూనా సేకరించకూడదు.
➡ పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీసుకోరాదు. నేలపై ఉన్న గడ్డి, చెత్త కలుపు మొక్కలు తీసివేయాలి. పొలంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించాలి. నీడలో ఆరబెట్టాలి.
➡ మట్టి బాగా ఆరిన తరువాత పాలథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం గతంలో సాగుచేసిన పంట వివరాలు నమోదు చేసి పరీక్షా కేంద్రానికి పంపాలి.
➡ వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనాలు సేకరించాలి. పండ్ల తోటల్లో మూడు అడుగుల లోతులో నమూన తీయాలి.

భూసార పరీక్షలు ఎంతో మేలు



భూసార పరీక్షలతో ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. భూమిలో లోపించిన పోషకాలు గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించుకోవచ్చు. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది అన్ని మండలాలతో పాటు ఆస్పిరేషనల్ బ్లాక్స్‌లో భాగంగా చిప్పగిరి, హొళగుంద మండలాల్లో 3,019 మట్టి పరీక్షలు లక్ష్యం ఇచ్చారు.

– సునీత, ఏడీఏ, ఆలూరు

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆలూరు రూరల్: పురుగు మందు తాగి వీరేష్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన వివరాలు.. ఆలూరు మండలం అంగసకల్ గ్రామానికి చెందిన వీరేష్ ఆదోనిలో హమాలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులో పురుగు మందు తాగాడు. గమనించిన బంధువులు వీరేష్‌ను ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం కోసం బళ్లారికి తీసుకెళ్లారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మద్దికెర: సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పౌర్ణమి పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

జూన్ 1న హనుమజ్జయంతి

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయిలో జూన్ 1న హనుమజ్జయంతి నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. హనుమజ్జయంత్రి సందర్భంగా నిర్వహించనున్న రథోత్సవంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొంటారన్నారు.

పౌర్ణమి పూజలు


పూజలందుకున్న గాయత్రీ మాత

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీమాత ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మ వారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వాసుపత్రి సేవలను వినియోగించుకోవాలి


పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ ప్రవీణ్‌కుమార్

తుగ్గలి: ప్రభుత్వాసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంఅండ్ హెచ్ఓ వై ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం సాయంత్రం తుగ్గలి, పగిడిరాయి పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు విభాగాలను, 108 వాహనాన్ని పరిశీలించారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గర్భిణులు ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. రోగుల పరిస్థితిని బట్టి సాధ్యమైనంత వరకు ఇక్కడే చికిత్స అందించాలని, తప్పనిసరి పరిస్థితుల్లోనే కర్నూలుకు రెఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. విధులకు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, ప్రతిమ, హరిత, మినాజ్‌పాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకప్ప స్వామి ఆరాధన


స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

మద్దికెర: మద్దికెర – బొజ్జనాయునిపేట రహదారిలో కొలువైన వెంకప్ప స్వామి ఆరాధన ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారి సమాధిని వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం మద్దికెర, బొజ్జనాయునిపేట తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారికి ఆకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామ శివారులో గురువారం పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం తరలుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రాజోళికి చెందిన శరత్‌కుమార్ అనుమానాస్పదంగా వెళ్తుండగా అదుపులోకి తీసుకుని సోదాలు నిర్వహించారు. 40 టెట్రా ప్యాకెట్ల (90ఎమ్ఎల్ విస్కీ) కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

దేవనకొండ: రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకుడు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద రైతులతో కలిసి అఖిల భారత రైతు బహాసభ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ వచ్చేస్తోందని రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జాన శ్రీనివాసులు, యూసుఫ్, ధర్మ, రాము, కందనాతి కృష్ణ, శ్రీనివాసులు, రంగస్వామి, కౌలుట్ల, వెంకటేష్, మద్దిలేటి, సందన్న, వీరన్న, మధు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


స్నేహితుని భార్యకు నగదు అందజేస్తున్న మిత్రులు

మద్దికెర: మండల కేంద్రానికి చెందిన షేక్షావలి ఈ నెల 14న అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు (1998–99 సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వవిద్యార్థులు) అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు నడుంబిగించారు. తలా కొంత నగదు పోగు చేసి రూ.56 వేల ఆర్థిక సాయాన్ని షేక్షావలి భార్య బేగంకు గురువారం అందజేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పత్తికొండ రూరల్: స్థానిక శారద వృద్ధాశ్రమంలో గురువారం వడ్డెర సంఘం నాయకుడు వడ్డే లక్ష్మీనారాయణ తన కుమార్తె లత వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ముందుగా లత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ సూపర్‌వైజర్లుతో మాట్లాడుతున్న సీడీపీఓ మద్దమ్మ

ఆలూరు: బాలింతలు, గర్భిణులకు తప్పనిసరిగా పౌష్టిక ఆహారం అందజేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ మద్దమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదేశించారు. ఆలూరు, హాలహర్వి మండలాల్లోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె గురువారం తనిఖీ చేశారు. అనంతరం స్థానిక సీడీపీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పాలు, గుడ్లు, చిక్కీలు, కంది బేడలు బాలింతలు, గర్భిణులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతమ్మ, ఈరమ్మ, ప్రసన్న, షీభారాణి, చెన్నమ్మ, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో దాయాదుల ఘర్షణ


గాయపడిన చాకలి మద్దిలేటి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో పొలం విషయంలో గురువారం దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి రామకృష్ణ, మద్దిలేటిలు చిన్నాన్నా, పెద్ద నాన్న కుటుంబ సభ్యులు. కొంత కాలంగా ఇరు కుటుంబాల మధ్య పొలంలో పైపులు వేసే విషయంలో గొడవలు ఉన్నాయి. మద్దిలేటి తన పొలంలో వేసిన పైపులను రామకృష్ణ తొలగించాడు. ఈ స్థితిలో గురువారం మరోసారి మద్దిలేటి నీటి సరఫరా కోసం పొలంలో పైపులు వేసుకున్నాడు. ఈ పైపులను రామకృష్ణ తొలగిస్తుండగా మద్దిలేటి ఎందుకు తొలగిస్తున్నావని ప్రశ్నించడంతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం ఏర్పడి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో మద్దిలేటి, శేఖర్, వసుంధరకు గాయాలయ్యాయి. అలాగే చాకలి రామకృష్ణకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఘర్షణకు గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ చాకలి మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామకృష్ణ, వెంకటేష్, కార్తీక్, పార్వతిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వారికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తాగునీటి కష్టాలు

హొళగుంద: మండల కేంద్రంలోని 5వ వార్డు, దేవమ్మ వీధి తదితర కాలనీలలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్‌తో ఇప్పుడున్న జనాభాకు తగ్గట్టు నీరు సరఫరా కాకపోవడతో నీటి సమస్య తలెత్తింది. రోజుల తరబడి నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి వాటర్‌మెన్‌లతో గొడవకు దిగుతున్నారు. సంబంధిత అధికారులను పైప్‌లైన్ మార్చి నీటి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కనులపండువగా ఎల్లమ్మ తిరుణాల


అమ్మవారి రథోత్సవ దృశ్యం


ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి గ్రామదేవత రేణుకా ఎల్లమ్మ తిరుణాల కనుల పండువగా సాగింది. గురువారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చన, పూర్ణాహుతి, కుంకుమార్చనలు జరిగాయి. అమ్మవారు బంగారు, వెండి ఆభరణాలు, పూల అలంకరణలతో దర్శనమిచ్చారు. మహిళలు కుటుంబ సమేతంగా వేలాదిగా తరలివచ్చి బోణాలు సమర్పించారు. సాయంత్రం రథోత్సవంలో భాగంగా రేణుకాఎల్లమ్మ అమ్మవారు ఆమె కుమారులు జంపన్న, పరశురాముడుల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులు గావించి, గుడిచుట్టూ రథోత్సవం నిర్వహించారు. భక్తుల రాకతో ఎల్లమ్మ ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. అంగళ్లలో ఆడపడుచుల గాజుల కొనుగోళ్లు, పిల్లల బొమ్మల కొనుగోళ్లతో సందడిగా మారింది. రథోత్సవంలో బ్రహ్మగుండం ఆలయ చైర్మన్, ఎల్లమ్మగుడి ధర్మకర్త బొమ్మన పెద్దిరెడ్డి పాల్గొన్నారు.


కిక్కిరిసిన ఎల్లమ్మ ఆలయ పరిసరాలు

నేటి నుంచి టెన్త్, ఇంటర్ పరీక్షలు

కృష్ణగిరి: వెల్దుర్తి, కృష్ణగిరి మండల కేంద్రాల్లో ఇంటర్, టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ విద్యార్థులకు వెల్దుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కృష్ణగిరి మోడల్ స్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. టెన్త్ విద్యార్థులకు వెల్దుర్తి బాలుర, బాలికల జెడ్పీ హైస్కూళ్లతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఇందిర తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

➡ **చిప్పగిరి:** స్థానిక జూనియర్ కాలేజీలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 308 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 173 మంది కలిపి మొత్తం 481 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నటు ప్రిన్సిపాల్ వరదరాజులు తెలపారు.

ఏకాగ్రతతో చదవాలి


నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నపురెడ్డి

ఆలూరు: ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నపురెడ్డి సూచించారు. ఇటీవల ఎల్ఎన్‌టీ, రాయల్‌ఇన్ఫ్రా అకాడమీలో ఉద్యోగాలు సాధించిన పాలిటెక్నిక్ విద్యార్థులను గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అభినందించి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు.

నీటి సమస్య పరిష్కారం

హాలహర్వి: మండలంలోని మెదేహాల్, కామినహాల్, సాకిబండ గ్రామాల్లో నీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించినట్లు ఎంపీడీఓ ఆంథోనీ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, చేతిపంపులు, బోర్లకు మరమ్మతులు చేయించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా నీటి సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలి


వేరుశనగకాయల బస్తాలను రైతులకు అందజేస్తున్న ఏడీఏ

దేవనకొండ: ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ మోహనవిజయకుమార్ సూచించారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మండలానికి 2,800 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరయ్యాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే అందిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున పత్తి విత్తనాలు కొనుగులు చేసే రైతులు బిల్లు భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా డీలర్లు బిల్లు ఇవ్వకుంటే మండల వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. లూజు విత్తనాలు ఎలాంటి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదన్నారు. లైసెన్సులు లేకుండా విత్తనాలు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఓ సురేష్‌బాబు, ఏఈఓలు జయరామ్, రంగన్న, యోగి పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగు చేయండి


పైరును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రతి రైతు తన పొలంలో సాగు చేసే ప్రధాన పంటకు 45 రోజుల ముందు నవధాన్యాల సాగు చేయడం ద్వారా ఆదాయం తోపాటు, దిగుబడి పూర్తయిన నవధాన్యాల పంటను కలియదున్నడం ద్వారా పుడమితల్లి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి షేక్ మాబువలి తెలిపారు. గురువారం ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని బోయనపల్లె గ్రామ రైతు వడ్డె బీసన్న తన ఎకరా పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన 30 రకాల విత్తనాల సాగును పరిశీలించారు. అనంతరం పలువురు రైతులతో సమావేశమై మాట్లాడుతూ ఆశాజనక దిగుబడి వస్తుందని తెలుపుతూ సాగు అనంతరం కలియదున్నే పంట ఫలితాలు వివరించారు. నేలలో కర్బన శాతం పెరగడం, జీవ వైవిధ్యంతో ప్రధాన పంట మొక్కల పోషకాల లబ్ధి, చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే శక్తి, నేల కొత అరికట్టబడి, నేల గుల్లబారుతుందన్నారు. విత్తన గుళికల తయారీ, బీజామృత విత్తన శుద్ధి తదితరాలపై రైతులకు వివరించారు. ఆయన వెంట ఐసీఆర్పీ రామచంద్రుడు ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

- మూడు రోజుల తర్వాత వెలుగులోకి
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

హాలహర్వి: యాభై యేళ్ల ఓ వ్యక్తి తొమ్మిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో మూడు రోజుల క్రితం జరిగినా ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాలు.. మూడు రోజుల క్రితం హాలహర్వికి చెందిన బాలిక ఇంట్లో ఒక్కతే ఉండడం 50 ఏళ్ల వీరేష్ గమనించాడు. ఇంట్లోకి చొరబడి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు సాయంత్ర పోలీసులను కలిసి ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడుగేస్తే..అడుసే


ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు నీరు

చిప్పగిరి: మండలంలోని ఏరూరు గ్రామ ప్రధాన రహదారిలో అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంది. మురుగు నీరు రోడ్డుపై పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. అటుగా వెళ్లాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, మురుగు నీరు రోడ్డుపై నిలువకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

మల్లేశ్వరుడి జాతరకు తరలిన భక్తులు


హొళగుంద నుంచి మల్లేశ్వరుడిని వరించిన స్వామితో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిరుగుప్ప తాలూకా తెక్కలకోట గ్రామ కొండల్లో వెలిసిన వరవిన మల్లేశ్వరస్వామి జాతరకు హొళగుంద నుంచి భక్తులు భారీగా తరలి వెళ్లారు. మల్లేశ్వర స్వామిని మండలానికి చెందిన బోయ కులస్తులు, కొన్ని దళిత కుటుంబాలు కొలుస్తాయి. వీరు గురువారం స్వామిని వరించిన భక్తుడితో కలిసి బండారం సమర్పించేందుకు కాలినడకన తెక్కలకోటకు బయలుదేరి వెళ్లారు. సాయంత్రం స్వామి సన్నిధికి చేరుకుని రథోత్సవాన్ని కనులారా వీక్షించారు. శుక్రవారం మల్లేశ్వర స్వామికి, మాళమ్మ అమ్మవారికి కల్యాణం నిర్వహించనున్నట్లు వాల్మీకి కుల పెద్దలు తెలిపారు.